# ★ గడియారం జయం పలికింది ★

'మీ న'

రావుగారి పెద్ద భవనంలో విశాలమైన డ్రాయింగ్ రూమ్‌లో ఫ్యాన్ క్రింద రావుగారు మూర్తి తెచ్చిన ఏవో కాగితాలు చూసుకుంటున్నారు. మూర్తి రావుగారి స్వంత కంపెనీలో క్రొత్తగా చేరిన గుమాస్తా. మూర్తి చురుకైన కుఱ్ఱవాడు. చాలా తెలివిగలవాడు. అతను బి. ఎ. ఫస్ట్ క్లాసులో పాస్ అయి లెఖ్ఖల్లో ప్రథముడుగా వచ్చాడు. ముందు ఇంకా పై చదువులకి వెళ్ళాలని అభిలాషవున్నా. తండ్రి హఠాత్తుగా పోవడంతో చదువుకి స్వస్తిచెప్పి కుటుంబ పోషణకోసం ఉద్యోగంలో చేరాడు. రావుగారు కూడా స్వతహాగా చాలా మంచి మనిషి, యిట్లాంటి యువకుల్ని పైకి తేవాలని అభిలాషకల మనిషి. కాబట్టి మూర్తికి త్వరగా ఉద్యోగం లభించింది. ఇందులో కొంత రామం సహాయం కూడా లేకపోలేదు. రామం ఎవరో కాదు, రావుగారి తమ్ముడి కుమారుడు. మూర్తికి స్కూల్ ఫైనల్‌నుంచి క్లాస్ మేటు, ప్రాణమిత్రుడు. రామానికి పైచదువులకి పోయే అవకాశాలు చాలా వున్నా, అతనికి అంత ఆసక్తి లేకపోవటంతో ఆఒక్క డిగ్రీ చాలనుకొని అంతటితో ఆపేశాడు. కాని ఊరికినే కూర్చోటం దేనికని పెత్తండ్రిగారి కంపెనీలోనే తను ఒక గుమాస్తాగా చేరాడు.

మూర్తి రావుగారి వైపు తదేక ధ్యానంతో చూస్తున్నాడు. తను వేసిన ఎక్కౌంట్స్‌లో ఏదన్నా తప్పు ఉందేమోనని, అది అతను చూసి ఏమంటాడోనని భయంతోను. ఇంతలో హఠాత్తుగా మేడమీదనుంచి కమ్మని పాట వినిపించింది. అదేదో హిందీ సినీమాలో లతా మంగేష్కర్ పాడింది. "ఎంత కమ్మని గొంతుక. అచ్చంగా లతయే" అనుకుంటున్నాడు మూర్తి. ఇంతలోకే రావుగారు తలెత్తి "అమ్మాయ్! రాధా," అని పిల్చారు. గదంతా ఒక్కసారి వెలుగు వెలిగినట్లనిపించింది మూర్తికి. "ఏం! నాన్నగారు" "ఏమి కమ్మదనం! ఎంత వినయం!" అనుకున్నాడు మూర్తి. "ఆ సన్నని, నాజూకైన తెల్లని శరీరానికి సువర్ణలత అనో, హేమలత అనో అంటే బాగుండేది" అనుకున్నాడు. "నేను యిప్పుడే కంపెనీకి వెళ్ళిపోవాలి. భోజనం క్యారియర్‌తో అక్కడికే పంపండి" అంటూ చివాల్న లేచారు రావుగారు. మూర్తికి ఏదో లోకంలోంచి తెప్పరిల్లు కున్నట్లనిపించింది. తను ఆ కాగితాలు తీసుకుని యింటికి బయలుదేరాడు. తోవలో ఏవేవో ఆలోచించుకుంటున్నాడు. "రాధ! ఎంత చక్కటి పేరు. తనపేరు కృష్ణమూర్తి అయితే ఎంత బాగుండేది. పోనీ నారాయణమూర్తి అయితేమాత్ర మేం? నారాయణుని అవతారమేగా కృష్ణుడు. కాబట్టి తనూ, రాధ ... రాధ గొప్పయింటి బిడ్డ. పువ్వుల్లో పెరిగింది. తను ఆమె భర్త అవడానికి ఏమన్నా తగునా. తన తాహతెక్కడ, ఆమె తాహతెక్కడ. రాము చేత కబురంపితే మాత్రం ఆమె ఒప్పుకుంటుందని నమ్మక మేమిటి. తాహతు, హోదా అడ్డు రావచ్చు." "ఇలాంటి అఘాయిత్యాలకి పాలుపడితే వున్న ఉద్యోగం కూడ ఊడిపోతుందేమో" ఇలా తన ఆలోచనలు ఒకదారీ తెన్నుకు రాకుండానే యిల్లు వచ్చేసింది. టైము చూసుకున్నాడు. తొమ్మిదిన్నర. ఇంట్లో అడుగు పెట్టాడో లేదో గడియారం 'రంగ్'మని కొట్టింది. చెల్లెలు మణి ఎదురుగుండా పరుగెత్తుకొచ్చి "అన్నయ్యా, గడియారం జయం పలికిందిసుమా. నేనూ అమ్మా నీ పెండ్లి విషయమై మాట్లాడుతున్నాం. అమ్మ అన్నయ్యకి పెండ్లి చెయ్యాలి అంది. అన్నయ్యకి పెండ్లి అనేసరికే గడియారం కొట్టింది" మూర్తి ముఖం ఒక్కసారి విప్పారింది. తనకి అంతేగా జరిగింది. రాధ నా భార్యఅయితే ఎంత బాగుండును అని తానూ అనుకున్నాడు. వాక్యం పూర్తి కాకుండా భార్య దగ్గరే గడియారం కొట్టింది. "అన్నయ్యకి పెండ్లి...." "రాధ నా భార్య...." అబ్బ సత్యం అయేలాగు చెయ్యి భగవంతుడా అని అరచేతిని ముద్దు పెట్టుకున్నాడు.

సాయంత్రం మూడున్నరైంది. బద్ధకంగా ఒళ్లు విరుచుకొని కాఫీ కని బయలుదేరాడు మూర్తి రాధని మళ్ళీ ఎట్లా చూడడమా అని ఆలోచించుకుంటూ.

"ఏంరోయ్! దేవునిముందు నైవేద్యం పెట్టిన ఫలహారాల్లాగే వున్నాయే, కదలకండా నీ కాఫీ దోశాను" అంటూ రామం, మూర్తి కూర్చున్న టేబుల్ దగ్గరకి వచ్చి కూర్చున్నాడు. "ఏంరా దీర్ఘాలోచనలోపడి నన్ను పిలవకండానే యివాళ కాఫీకొచ్చేశావే. ఇంకా నీ ఫారన్ పిచ్చి పోలేదా? పోన్లేరా, మా కంపెనీకి మంచిభవిష్యత్తువుంది. అప్పుడు ఒకవేళ ఫారన్ కంట్రీస్‌తో ట్రేడ్ ప్రారంభిస్తే అప్పుడు నిన్ను రిప్రెజెంటెటివ్‌గా పంపుతార్లే, పెద్ద

నాన్నగారు" అంటూ తన ధోరణిలో పడ్డాడు రామం. "అన్నట్లు ఒరేయ్ యివాళ మా చిట్టి పుట్టినరోజు. నిన్ను సాయంత్రం పార్టీకి తప్పకుండా తీసుకరమ్మంది."అన్నాడు రామం. మొదట్లో ఒంట్లో బాగులేదనే సాకుతో తప్పించుకోవాలని నోరుతెరచి, యింతట్లో ఏదో ఆలోచన మెదడులోమెరియడంతో "సరే" అన్నాడు.

రామం వెళ్ళడానికని లేవబోతుంటే చెయ్యి పుచ్చుకుని ఆపి, "ఒరేయ్, యివాళ వాళ్ళ అమ్మాయి రాధను చూశాను. ఎన్నడు ఆ అమ్మాయిని గురించి చెప్పలేదు?" ఎంత ప్రాణ స్నేహితుడైనా అంతకంటే ఎక్కువ అడిగితే బాగుండదని సంశయంతో ఆపేశాడు మూర్తి.

"ఓ! ఆమె?" ఆ అమ్మాయి రావుగారి అసలు కూతురు కాదు. ఆ అమ్మాయి మిసెస్ రావుగారి అక్క కూతురు. వాళ్ళ నాన్న కలకత్తాలో ఉద్యోగం చేస్తూ పోయారు. వీళ్ళు యిన్నాళ్ళు అక్కడే వున్నారు. ఈ అమ్మాయి స్కూల్ ఫైనల్ పాసయి. లోకజ్ఞానానికి, ఆచదువు చాలనుకొని అక్కడికి ఆపి చిత్రలేఖనం సంగీతం అభ్యసిస్తోంది. ఈ మధ్య వాళ్ళ అమ్మకూడ పోవడంతో పినతల్లిగారింటికి వచ్చేసింది. రావుగారు కూడా ఈమెని చాల ఆదరంగా చూస్తువుంటారు. ఈమెకూడా తల్లి తండ్రులు లేనిలోటును పరిగణించకండా వీరినిగౌరవిస్తూవుంటుంది. అన్నట్లు తనుకూడా యివాళ సాయంత్రం వస్తుందిగా మాట్లాడవచ్చు. రాధకూడా చాలా సోషల్ గానే వుంటుంది. అన్నట్టు మీచెల్లెలిని కూడా తీసుకురా!" దీనితో మూర్తికి తన ఆలోచన నిజమైనందుకు చాలా సంతోష మయింది. మూర్తి కళ్ళలో కొత్త వెలుగును చూసి రామం కూడా సంశయంతో నవ్వాడు. "పోదాం పద!" అంటూ యిద్దరు స్నేహితులు ఒక్కసారే లేచారు.

ఆ రాత్రి చాలాసేపు మూర్తి ఆలోచించాడు. రాధకి హోదా కావాలట. డబ్బు ముఖ్యం కాకపోయినా ఆఫీసర్ గారి భార్యా అనిపించుకోవాలిట. ఆస్తిలేకపోయినా మంచి ఉద్యోగంలో వున్న అతన్నే తను వివాహమాడుతుందట. ఇవన్నీ తనకి రామం చెప్పేడు. రామం తన మనస్సు గ్రహించి చూచాయగ రాధకిచెప్తే ఆమె చెప్పిన సమాధానం. మొదట్లో మూర్తి దీనిని గర్వం, అహంభావంగా భావించినా రాధమీద తనప్రేమ అట్లా కాదనిపించింది. గొప్పయింట్లో పుట్టి హోదాగా పెరిగిన పిల్లకి పెద్ద ఆఫీసర్ భార్యా కావాలనే కోరిక సహజమే. ఎందుకంటే అది సాధ్యం కనుక. పోనీ తను ఐ. ఎ. ఎస్. చదివి ఆఫీసరే అయితే. ఈ ఆలోచన తట్టేసరికి మూర్తికి పడుతున్న మగతనిద్ర కాస్తా వదిలి పూర్తిగా మెళకువ వచ్చేసింది. తన అదృష్టం బాగుంటే సెలెక్టు అవవచ్చు. ఇంకా ఎనిమిదినెలలు. బాగాకష్టపడి చదువుతే ఈ టైము చాలు. డబ్బుకి నాన్న మిగిల్చిన పొలంలో కొంత అమ్మవచ్చు. ఆ మర్నాడే అమ్మని ఒప్పించి ఢిల్లీ నుంచి పోస్టల్ ట్యూషన్ చెప్పించుకోవాలనే నిర్ణయానికి వచ్చాకనే మూర్తికి నిద్ర పట్టింది.

ఈ ఎనిమిది నెలలు మూర్తి అహోరాత్రాలు చాలా శ్రమపడి చదివాడు. పంతాలు ఏ సాహసాన్నయినా సాధ్యం చేస్తాయిగా. ఈ ఎనిమిది నెలలు ఎలాగడిచాయో మూర్తికి తెలీకుండానే అయిపోయాయి. పరీక్షలు చాలా బాగావ్రాశాడు. వ్రాయడమేమిటి తను సెలెక్టు అయి యిన్ కంటాక్స్ ఆఫీసర్ గా నియమింప బడటం ఏమిటి అన్నీ ఒక్కసారే జరిగాయి.

ఒకవేళ సెలెక్టుకాని పక్షంలో చేతిలో నున్న ఉద్యోగం పోకుండా మూర్తి రావుగారిని వేడుకుని యిన్నాళ్ళూ శెలవుమీదే వున్నాడు. ఇప్పుడు ఆయనవద్ద సెలవు తీసుకోడానికి వెళ్ళి వస్తూ ఒక్కసారి మేడనుచూసి "మళ్ళీ రాధను పెళ్ళిచూపులకి వచ్చినప్పుడు ఈ మేడను కూడా దర్శించటం అనుకుంటూ వెళ్ళిపోయాడు.

మధ్యవర్తులచేత కబురంపటం, పెళ్ళిచూపులకివెళ్ళటం, ముహూర్తం నిశ్చయించుకోటం అన్నీ అనుకున్నట్టిగానే జరిగి పోయాయి.

రావుగారింట్లో పాటకచేరి జరుగుతోంది. అందరు ఎవరి హడావిడిలో వారున్నారు. సంగీత ప్రియులు పాట వింటో తన్మయత్వంలో మునిగి వున్నారు. పెళ్ళివారు పనులలో హడావుడిగా వున్నారు. ఎవర్ని జూసినా హడావిడిగా తిరిగేవాళ్ళే. ఇంత తిరుగుతున్నా ఒక్కళ్ళ మొహంలోను, చిరాకుగాని కోపంగాని లేక అందరి మొహాలు కలకలలాడుతూనే వున్నాయి. రాధని పలకరించడానికి యిదే మంచి సమయ మనుకున్నాడు మూర్తి. "నేను నిన్ను పంతంతో పెళ్ళి చేసుకున్నా ననుకుంటున్నావా? అది కొంత వరకు నిజమైనా దీనికి కారణం నీమీద ప్రేమేకదూ?''

"......... ........."

"నేను యింతటి వాణ్ణయానంటే యిదంతా నీ ప్రభావమే. నీవు పెద్ద ఆఫీసరునిగాని పెళ్ళాడ నన్నావుట. అందుకే కష్టపడి చదివి ఈ ఉద్యోగం సంపాదించాను. లేకపోతే మీకంపెనీలోనే గుమాస్తాగావుండేవాణ్ణి. ఇదంతా నీ చలవేసుమా. మొదటిరోజు నిన్ను చూశాక నీవు నా భార్యవచ్చే విషయం ఆలోచిస్తుండగా గడియారం జయం కొట్టింది. అప్పట్నుంచి ఏదో వెఱ్ఱినమ్మకం నిన్ను భార్యగా పొందగలనని. అదీకాకుండా నేను ఎప్పుడు ఆశావాదినే. నేను యింత మాట్లాడుతున్నా నీవు ఏమీ మాట్లాడవేం, నిన్ను సాధించానని కోపమా ?

"........................"

"మౌనం అంగీకార సూచకం. అంటే నామీద నీకు కోపమే"

"అబ్బే. లేదండి" గబుక్కున అనుకోకండా అనేసి నాలుక కరచుకుంది. "మా బాబాయిగారికి తెలిసి నాయన ఢిల్లీ సెక్రటేరియట్‌లో మీకు ఉద్యోగం యిప్పిస్తానన్నారుట. అక్కడ వుంటే ఫారన్ వెళ్ళడానికి చాలా అవకాశాలు వుంటాయే. ఇదంతా నా అదృష్టం" అంటూ అతి కష్టంమీద సిగ్గణుచు కుంటూ అనగల్గింది రాధ. ప్రక్కన అమ్మలక్కల్లోంచి గుసగుసలు వినిపించాయి.

"ఇంకా పెళ్ళయి ఒకరోజన్నా అయిందో లేదో, అప్పుడే ఎలా నవ్వుతూ మాట్లాడుకుంటున్నారో"?

"అవును మరి ఈ కాలం వాళ్ళంతా అంతే."

ఈమాటలు వింటూ మూర్తీ, రాధా సిగ్గు పడ్డారు. ఇంతలోకే పాట కచ్చేరి ముగిసింది. మూర్తి రాధ చేత ఆమెకు నూటపదహార్లు. చీరె, రవికలగుడ్డ యిప్పించాడు. ఆవిడ అవి అందుకుని "విష్‌యు ఎ లాంగ్‌హాపీ మారిడ్ లైఫ్" అంటూండగానే గడియారం సాయంత్రం ఏడు గంటలు కొట్టటం ప్రారంభించింది. రాధ అప్రయత్నంగా తన పల్చని టిష్యూ చీరెలోంచి కనపడే మంగళసూత్రాలని చూచుకొని మనస్సులోనే నమస్కరించు కుంది. మూర్తి కూడా తన అరచేతిని ముద్దుపెట్టు కుంటూ రాధ వైపు చూసి "జయం" అన్నాడు. ఇద్దరు సన్నగా నవ్వుకున్నారు.

★


# రీటా హెయిర్ టానిక్
## తల వెంట్రుకలను పెంచును



రీటా కురుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్.

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరకు, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేలకువేలువాడి గుణమును పొంది యున్నారు. మీరుకూడా నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూదేశ మంతటా దొరకును.

వెల : సీసా 15 అణాలు.

**RITA**
**HAIR TONIC**

